దాతృత్వం ధన్యులను చేస్తుంది



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మణికొండ: దానగుణం ప్రతి మనిషిలోనూ ఉండాలని, మన కంటే పేదలకు మనం దానం చేసినపుడే మన జన్మ ధన్యం అవుతుందని మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సర్కిల్ బస్‌స్టాప్ వద్ద స్థానిక అరుణాచల శివ సేవా సత్సంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, అంబలి కేంద్రాన్ని ఆయన మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అరుణాచల సేవా సంస్థ ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తుందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను మరిన్ని కొనసాగించాలన్నారు. సత్సంగం ప్రతినిధులు బద్రీనాథ్, శ్రీహరి మాట్లాడుతూ... తమ సంస్థ తరఫున ప్రతి వారం మణికొండ నుంచి అరుణాచల యాత్రకు ఏసీ బస్సు వెళ్తుందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మీశ్రీ, నాయకులు సి.బీరప్ప, రాజేశ్, శ్రావణ్, విజయ్‌రెడ్డి, సత్సంగం సభ్యులు మనోహర్, జగదీష్, లవకుమార్, ధర్మారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించాలి



మణికొండ: పందెన్‌వాగు పరీవాహకంగా ఉన్న ఇళ్ల నివాసులకు దుర్వాసనతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, దానికి బాక్స్ డ్రైన్ నిర్మించి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం అన్నారు. ఆదివారం పార్టీ నాయకులతో కలిసి ట్రయల్స్ విల్లాస్, పందెన్‌వాగు పరివాహకంలో గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో బాగంగా పర్యటించి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పందెన్‌వాగులో నీటి ప్రవాహాన్ని తగ్గించేందుకు పంచవటి కాలనీలోని రోడ్డు నెంబర్ 10 వద్ద ఓ చెక్ డ్యాంను నిర్మించి మురుగునీటిని గతంలో మాదిరిగా షేక్‌పేట వైపు మళ్లించాలన్నారు. ట్రయల్స్ విల్లాస్ ముందు పంచవటి కాలనీతో కనెక్ట్ చేస్తు రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. ఓయూ కాలనీ రోడ్డులో పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా రోడ్డు వెడల్పు చేసి సమస్యను నివారించాలన్నారు. బీఆర్‌ఎస్ నేతలు ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీకాంత్, కిరణ్, బాబు, భానుచందర్, సుమనళిని, తిరుపతి, గోపి సాగర్ పాల్గొన్నారు.

రక్తదానంపై మరింత అవగాహన అవసరం



16వ సారి రక్తదానం చేసిన మహేష్‌కుమార్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న కమిటీ సభ్యులు

బండ్లగూడ: ఆపదలో ఉన్న వారిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని.. ఈ దిశగా మరింత అవగాహన అవసరమని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ గిరిధారి అవిఘ్న కమిటీ సభ్యులు జయసింహారెడ్డి, నికితా అజ్వానీ పేర్కొన్నారు. ఆదివారం తలసేమియాతో బాధపడుతున్న పిల్లల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. భవానీ కాలనీకి చెందిన మహేష్‌కుమార్ 16వ సారి రక్తదానం చేయడంతో ఆయనను అభినందించారు. పరిసర ప్రాంతాలకు చెందిన యువకులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ఆఫ్ బీజేఎంసీ జనరల్ సెక్రటరీ నరేందర్‌బాబు, అశోక్, రమీజ్, మహేష్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో కత్తితో దాడి

ఆటో డ్రైవర్‌కు గాయాలు



సయ్యద్ బాబా

అత్తాపూర్: మద్యం మత్తులో ఒకరినొకరు దూషించుకున్నరు.ఆటో డ్రైవర్‌పై మరో వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు సమాచారం మేరకు... అత్తాపూర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ బాబా(40) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతని స్నేహితులతో కలిసి శనివారం మద్యం సేవిస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన మరి కొంత మంది మద్యం సేవిస్తూ మత్తులో మాటామట పెరిగి వివాదం నెలకొంది. అదికాస్తా ముదిరి గొడవకు దారి తీసింది. వారి వద్ద ఉన్న కత్తితో సయ్యద్ బాబాపై దాడి చేశారు. దీంతో తలకు, ముక్కుపై గాయం అయింది. సయ్యద్ బాబా స్నేహితులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. సయ్యద్ బాబాపై దాడి చేసి పరారైన ముగ్గురిలో ఇద్దరిని అదుపులోకి తీసుకోగా మరొకరి కోసం గాలిస్తున్నారు. ఈ మేరకు అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.







పుదీనా, తాటిముంజలు, పుచ్చకాయలు, విక్రయిస్తున్న దృశ్యాలు

సమ్మర్‌లో కూల్‌గా..

శాస్త్రిపురం: వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు ప్రజలు వివిధ ప్రాంతాలకు వెళుతూ చల్లదనాన్ని ఇచ్చే రకాల ఆహారాలు, పండ్లను తీసుకుంటున్నారు. భానుడు భగభగల నుంచి విముక్తి కలిగిస్తూ నగర శివారు ప్రాంతాలైన అత్తాపూర్, శాస్త్రీపురం, బాపుఘాట్, హిమాయత్‌సాగర్, రాజేంద్రనగర్, ఆరాంఘర్, చింతల్‌మెట్, మీరాలం చెరువులు చల్లని విడిది ప్రాంతాలుగా మారాయి. వేసవిలో పర్యాటకుల సంఖ్య పెరగడంతో చల్లని కూల్ పాయింట్ అయిన ఈ ప్రాంతాలలో పల్లరసాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. శరీరానికి చల్లదనాన్ని ఇచ్చే పుదీనా రసం, మజ్జిగ, లస్సీ, నిమ్మరసం, ఐస్ క్రీమ్‌లు, పుచ్చకాయలు, తాటి ముంజలు, కొబ్బరి బొండాలు తదితర వాటిని ఈ ప్రాంతంలో అమ్ముతున్నారు. చల్లదనాన్ని అందించే విటమిన్లతో కూడిన వేసవి స్పెషల్ పండ్లు, రసాలను ఆస్వాదిస్తూ ఆడిపాడుతూ సేదతీరుతున్నారు. సైకిళ్లపైన అమ్మే వ్యాపారులతో పాటు గృహిణిలు కూడా ప్రయాణికులకు సేదతీరడానికి వేసవి తాపం తీర్చే చల్లని పదార్థాలు విక్రయిస్తూ నిత్యం వేల రూపాయల వ్యాపారం చేస్తున్నారు.

వీధి కుక్కలతో పరేషాన్

- వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు
- పాదచారులు, వాహనదారులపై దాడులు
- భయాందోళనలో ప్రజానీకం



వీధిలో సంచరిస్తున్న వీధి కుక్కలు

శాస్త్రిపురం: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా బస్తీల్లో తిరుగుతూ హల్‌చల్ చేస్తున్నాయి. సర్కిల్ అధికారులు వీధికుక్కల నివారణకు తీసుకుంటున్న చర్యలు ఫలితాన్ని ఇవ్వడం లేదు. వీధి కుక్కలను పట్టుకెళ్లడానికి సిబ్బంది బస్తీల్లో తిరుగుతున్నా వీధికుక్కలు మాత్రం వారికి చిక్కడం లేదు. ప్రధానంగా సర్కిల్ పరిధిలోని డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కల సంచారం బాగా ఉంది. వీధి కుక్కల కారణంగా బస్తీల్లో తిరగాలంటే ప్రజలు భయపడుతున్నారు.

- శాస్త్రీపురం, హసన్‌నగర్, ఎన్‌టీఆర్‌నగర్, ఇంద్రానగర్, చితల్‌మెట్, వీరన్నకుంట, ఎంఎం పహడీ ప్రాంతాలలో వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ రహదారుల వెంట నడిచే వారి వెంట పడుతున్నాయి. సర్కిల్ అధికారులను తమ ప్రాంతంలోని వీధి కుక్కలను పట్టుకువెళ్లాలని ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు.
- చింతల్‌మెట్, పాండురంగానగర్, వీరన్నకుంట తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు విచ్చల విడిగా సంచరిస్తు నడుచుకుంటు వెళ్లే వారిని తరుముతున్నాయి. అక్కడక్కడ చెత్త కుండీల వద్ద మాంసపు దుకాణాదారులు మిగిలిన మాంసం వ్యర్థాలను కవర్లలో తీసుకువచ్చి పడవేస్తుండటంతో కుక్కలు పచ్చి మాంసానికి అలవాటు పడ్డాయి. ఫలితంగా ఎక్కడ ప్లాస్టిక్ కవర్లు కనబడినా వారి వెంట పడుతూ కవర్లు దక్కించుకుంటున్నాయి. వీధి కుక్కల కారణంగా బస్తీల్లో రాత్రుళ్లు ప్రజలు బయటకు రాలేకపోతున్నారు. రాత్రి వేళల్లో కుక్కలు మొరుగుతూ ప్రజల వెంట పడుతుండడంతో చిన్నారులను బయటకు పంపాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని వీధి కుక్కలను పట్టుకువెళ్లాలని ప్రజలు కోరుతున్నారు.

ఆస్తి పన్ను తగ్గించేదాకా పోరాడుదాం



సమావేశంలో పాల్గొన్న ఆల్ కాలనీస్ ఫెడరేషన్ సభ్యులు

ఆల్ కాలనీస్ ఫెడరేషన్ తీర్మానం

మణికొండ: ముందస్తు నోటీసులు, మున్సిపాలిటీ పాలకవర్గ సమావేశంలో చర్చించకుండా ఇష్టారాజ్యంగా ఐదు రెట్లు పెంచిన ఆస్తి పన్ను తగ్గించేదాకా అవిశ్రాంత పోరాటం చేయాలని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్ కాలనీస్ రెసిడెన్సీస్ వెల్ఫేర్ అసోసియేషన్స్ ఫెడరేషన్ తీర్మానించింది. ఆదివారం అధ్యక్షుడు వంశీ ఆధ్వర్యంలో హరివిల్లు అపార్ట్‌మెంట్స్ క్లబ్ హౌస్‌లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆస్తి పన్నుల పెంపుపై ఇప్పటికే కోర్టులో కేసు వేసి న్యాయ పోరాటం చేస్తున్నామన్నాని... కొత్త వాటి వసూళ్లపై స్టే విధించిందని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజావసరాలైన పార్కులు, లింక్ రోడ్లు, డ్రైనేజీ, దోమల సమస్య, ప్యాచ్ వర్క్‌లు, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు లాంటి ప్రధాన సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించారు. వేసవిలో ఎండలు పెరుగుతున్న కొద్దీ బోర్లు వట్టిపోతున్నాయని, జలమండలి అధికారులు రోజురోజుకూ కొత్త బల్క్ కనెక్షన్‌లు ఇస్తూ కాలనీలకు నీటి సరఫరా సమయాన్ని తగ్గిస్తున్నారని పలు కాలనీల వాసులు పేర్కొన్నారు. వేసవి కాలం పోయే వరకు కొత్త కనెక్షన్‌లను నిలిపి కాలనీలకు నీటి సమయాన్ని పెంచాలని జలమండలి అధికారులను కోరాలని నిర్ణయించారు. ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులు, కోశాధికారి రవీందర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి కిరణ్, ఉపాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, రాజసింహారెడ్డి, ప్రవీణ, పలు కాలనీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

సందడిగా అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000–2001వ విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులందరూ ఆదివారం బుద్వేల్‌లోని ఎస్‌ఎస్‌ఆర్ బ్యాంకెట్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు బోధించిన ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకొని సందడి చేశారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఆశీర్వదించారు. ఉపాధ్యాయులు అనంతరెడ్డి, గాబ్రియేలమ్మ, యాదయ్య, వరలక్ష్మి, శాంత, ఉమ, సునేత్రి, అంజలీదేవి, నీరజ, ఉత్తర, ఉమారాణి, లలిత, హేమలత, అనంతప్ప, వాణి, ఎ.భీమయ్య, రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన వెంకట నారాయణ రెడ్డి, పూర్వ విద్యార్థులు వినోద్ కన్నా, నరేశ్, దాసు, నవీన్, ఫైజల్, నందు, కిరణ్ బేబీ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్ ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



కార్యవర్గ సభ్యులు

రాజేంద్రనగర్: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆనంద్ ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అచ్చిని సాయికాంత్, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, రఘు గౌడ్, సలహాదారులుగా వర ప్రసాద్, దేవి ప్రసాద్, ఆరీఫ్ ఖాన్, ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, కోశాధికారులుగా భాను, వెంకటేశ్, కార్యనిర్వాహక సభ్యులుగా నవీన్, బ్రహ్మ, అరవింద్, ఆనంద్, వెంకట్, రాకేశ్, అశ్వంత్, బాలస్వామి తదితరులు నియమితులయ్యారు. నూతన అధ్యక్షుడు సాయికాంత్ మాట్లాడుతూ... ఆనంద్ ఎన్‌క్లేవ్ అభివృద్ధికి తన కృషి చేస్తానని వెల్లడించారు. తనపై ఎంతో నమ్మకంతో అధ్యక్షుడిగా నియమించినందుకు ఎన్‌క్లేవ్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో అందరి సహాయ సహకారాలు తీసుకుంటూ సమస్యల సాధన కోసం కృషి చేయనున్నట్లు వెల్లడించారు.

20న మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం

రాజేంద్రనగర్: హైదర్‌గూడ ఎర్రబోడలోని భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి అష్టమ వార్షికోత్సవ కల్యాణ మహోత్సవాన్ని ఈ నెల 20వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు హైదర్‌గూడ అత్తాపూర్ కురుమ సంఘం శ్రీ మల్లికార్జున స్వామి ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం మల్లికార్జున స్వామి ఉత్సవ కమిటీ ప్రతినిధులు ముంగ్ర గౌరీ శంకర్, రాజు, మహేందర్, ఐలయ్యలు చైతన్య విలాస్ కాలనీలోని రామాలయంలోని అర్చకుడు శ్రీనివాసాచార్యులకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్వామివారి కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

నేడు అయ్యప్ప మండల పూజ

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లిలోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం 51వ రోజు మండల పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఆలయ ఆవరణలో ఆదివారం నిర్వాహకులు విలేకరులకు పూజా కార్యక్రమాలను వివరించారు. శ్రీ సిద్ధిబుద్ధి సమేత గణపతి, వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి శివ పంచాయతీని ద్వాదశ జ్యోతిర్లింగం సంతోషిమాత విగ్రహాలతో పాటు ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేసి 501 రోజులు పూర్తయిందని తెలిపారు. 51 రోజును పురస్కరించుకొని సోమవారం వేద పండితుల మంత్రోచ్చరనల నడుమ మండల పూజలను నిర్వహిస్తామన్నారు. ఉదయం 11.30 గంటలకు శివ పార్వతుల కల్యాణం, సాయంత్రం 6.30 గంటలకు అయ్యప్ప స్వామి మహా పడిపూజను నిర్వహిస్తామని వివరించారు. ఈల పాటి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో భజన ఏర్పాటు చేశామన్నారు. పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

గుండెపోటుతో మాజీ ఉపసర్పంచ్ మృతి



రఘునందర్‌రెడ్డి (ఫైల్)

శంషాబాద్ రూరల్: రామంజాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ కొమిరెడ్డి రఘునందర్‌రెడ్డి ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఉప సర్పంచుతో పాటు ఇంచార్జి సర్పంచ్‌గా చేసిన ఆయన సేవలను గ్రామస్తులు కొనియాడారు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం తెలియజేశారు.

ఆస్పత్రుల అవసరం పెరిగింది

- ఆరోగ్య సంరక్షణపై మరింత అవగాహన అవసరం
- బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్



ఆస్పత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న సైనా నెహ్వాల్ తదితరులు

మణికొండ: రోజు వారీగా శారీరక శ్రమ తగ్గిపోయిన నేపథ్యంలో కరోనా మహమ్మారి వచ్చాక ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒక సారి సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకుని వైద్యుల సలహాలను పాటించాల్సిన అవసరం ఏర్పడిందని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ అన్నారు. ఆదివారం ఆమె మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని బీఆర్‌సీ అపార్ట్‌మెంట్స్ ముందు మెడోరా స్పెషాలిటీ క్లినిక్‌ను మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా స్థానికంగానే ఉత్తమ ఆస్పత్రులు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అత్యవసర సమయంలో సమీపంలో ఉన్న ఆస్పత్రులే ప్రాణాలను నిలుపుతాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచేకోవాలన్నారు. కాంగ్రెస్ నాయకులు యాలాల నరేష్, కె.లక్ష్మీనారాయణ, తాజుద్దీన్, కిరణ్‌కుమార్, శ్రావణ్ కుమార్, డాక్టర్‌లు శిల్పారెడ్డి, చరధర్‌రెడ్డి, అశోక్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాల శుద్ధి



రాజేంద్రనగర్: మహనీయుల విగ్రహాల శుద్ధి కార్యక్రమాన్ని రాజేంద్రనగర్‌లో బీజేపీ నాయకులు నిర్వహించారు. పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు బాబురావు ఆధ్వర్యంలో ఉదయం బుద్వేల్ చౌరస్తాలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని శుద్ధి చేశారు. అనంతరం బైక్ ర్యాలీగా రాజేంద్రనగర్ చౌరస్తాకు చేరుకొని పార్టీ నాయకులు, కార్యకర్తలు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి చేశారు. విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ రంగారెడ్డి జిల్లా రూరల్ శాఖ అధ్యక్షుడు పతంగి రాజభూపాల్ గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను పలు విధాలా అవమానించిందని ఆరోపించారు. చివరకు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన అంబేడ్కర్ ఓటమికి కూడా ఆ పార్టీ కుట్ర చేసిందన్నారు. పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ వై.శ్రీధర్, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి, నేతలు మల్లేష్ యాదవ్, జోగి రవి, కోరని సదానందం, కోరని క్రాంతి, వేముల మల్లేష్, కె.హరికిషన్, జి.సబాద విజయ్ కుమార్, సోల్కర్ రెడ్డి, పి.రవీందర్, గౌనె శ్రీకాంత్ రెడ్డి, బండారి బాలకృష్ణ, పి.సందీప్, టి.మల్లేష్, కె.మల్లేష్ చారి, ఆర్.రాకేశ్, కె.ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న ఉత్తమ హైబ్రిడ్ రకాల విడుదల

- ఆవిష్కరించిన వ్యవసాయ విశ్వవిద్యాలయం
- అధిక దిగుబడితోపాటు రైతులకు ఎంతో మేలు చేసే రకాలు
- ఏసీ వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య





ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన ఐదు ఉత్తమ హైబ్రిడ్ మొక్క జొన్న రకాలను విడుదల చేసింది. భారత వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో ఇటీవల తమిళనాడులో నిర్వహించిన అఖిల భారత మొక్క జొన్న పరిశోధన సమన్వయ సమావేశంలో విడుదల చేశారు.

హైబ్రిడ్ మొక్క జొన్న రకాలు ఇవీ...

వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన ఉత్తమ హైబ్రిడ్ మొక్కజొన్న రకాలు దక్కన్ హైబ్రిడ్ మక్క 144, ఈహెచ్‌ఎం 182, డీహెచ్‌ఎం193, డీహెచ్‌ఎం 206, డీహెచ్‌ఎం218లో కలిపి ఈ విశ్వవిద్యాలయం నుంచి మొత్తం 24 మొక్కజొన్న హైబ్రిడ్ రకాలు విడుదల అయ్యాయి. ఇందులో డీహెచ్‌ఎం 144 (తెలంగాణ మక్క-6) రకంలో అధిక పిండి పదార్థాలు ఉండటం వలన ఇథనాల్ ఉత్పత్తికి బాగా అనుకూలంగా ఉంటుందని విశ్వవిద్యాలయం అధికారులు వెల్లడించారు. దీంతో పాటు డీహెచ్‌ఎం 206 (తెలంగాణ మక్క-3) మెట్ట సాగుకు అనుకూలమైనదని తెలిపారు. ఎండు తెగులును సమర్థవంతంగా తట్టుకుంటుందన్నారు. ప్రస్తుతం రైతాంగానికి అందుబాటులో ఉన్న వివిధ మొక్కజొన్న వంగడాలతో పోల్చితే డీహెచ్‌ఎం అన్ని విధాలా మేలైందని వారు స్పష్టం చేశారు. పరిశోధనలో రాబోయే కాలంలో రైతాంగం వినియోగించుకోవలసిందిగా విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

16 పంట రకాలకు కేంద్రం గుర్తింపు

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కాలంలో విడుదల చేసిన 16 రకాల వివిధ పంటలను ఇటీవల కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వ శాఖలో జరిగిన సమీక్ష సమావేశంలో అధికారిక ప్రకటిత రకాలుగా (నోటిఫైడ్ వెరైటీస్) గుర్తిస్తూ ప్రకటన విడుదల చేసింది. జయశంకర్ విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఆయా పంట రకాలను కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ వంత్రిత్వ శాఖ విత్తనోత్పత్తి ప్రణాళికలు రూపొందించి ఈ రకాలను రైతాంగానికి అందుబాటులోనికి తెవడానికి సహకరిస్తుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ విత్తన సంస్థలు ఈ రకాల మూల విత్తన సరఫరాకు ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

మేలు రకాలను గుర్తించాలి



రైతులకు తక్కువ పెట్టుబడిలో అధిక దిగుబడులు రావడం తక్కువ నీటితో పంట సాగయ్యేలా వంగడాలను తీసుకొచ్చేందుకు విశ్వవిద్యాలయంలో నిరంతరం కృషి చేస్తున్నాం. ఇందుకోసం వర్సిటీ శాస్త్రవేత్తలు తాము చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం. ఇప్పటి వరకు చాలా వరి వంగడాలను తీసుకొచ్చాం. ఇప్పుడు మొక్కజొన్న డీహెచ్‌ఎం చాలా మంచి రకాలు. ఇందులో 6 రకాలు మంచి దిగుబడి ఇస్తాయి. రైతులు ఈ విషయాలను గుర్తించి ఆయా రకాలను సాగు చేసుకోవాలి. ఇవి మెట్ట సాగుకు చాలా అనుకూలం. నీరు తక్కువగా ఉన్నా సాగు చేసుకోవచ్చు. – అల్దాస్ జానయ్య, ఉప కులపతి, పీజేటీఎస్‌యూ